- ఈసారీ బీసీలకు దక్కని హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవి
- బీసీ నేతలు, కార్పొరేటర్లు వేరు సమావేశం
- ఎమ్మెల్యే సీటు, పార్టీ పదవి రెడ్లకేనా అని ప్రశ్నలు



# బీజేపీలో బీసీ చిచ్చు

వరంగల్, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీజేపీలో బీసీ చిచ్చు రగులుకున్నది. బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామక ప్రకియపై బీసీ నేతలు భగ్గుమంటున్నారు. అగ్రవర్ణాల పార్టీ అనే ముద్రను కొనసాగించేలా రాష్ట్ర నాయకత్వం తీరు ఉన్నదని మండిపడుతున్నారు. ఇటీవలి వరకు రెండు దఫాలుగా బీజేపీ జిల్లా అధ్యక్ష పదవిలో రెడ్డి సామాజికవర్గానికి చెందిన రావు పద్మ ఉన్నారు. తాజాగా కొలను సంతోష్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకున్నది. హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్ష పదవిని మరోసారి రెడ్డి సామాజికవర్గం వారికే కట్టబెట్టడంపై ఆ పార్టీలోని బీసీ నేతలు, కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర నాయకత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్పొరేటర్లు రావుల కోమల, బైరి లక్ష్మి, గుజ్జుల వసంత, వన్నాల వెంకటరమణ సోమవారం సమావేశమయ్యారు. బీజేపీలో ఎమ్మెల్యే టిక్కెట్లు, పార్టీ జిల్లా అధ్యక్ష పదవులన్నీ ఒక వర్గం వారికే కేటాయించడం సరికాదని అసంతృప్తి వెల్లగక్కారు. జిల్లాల పునర్విభజన జరిగి దాదాపు పదేండ్లు కావస్తున్నదని, ఇప్పటికి ఒక్కసారి అయినా బీసీలకు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వలేదని చెబుతున్నారు. పార్టీలో బీసీలకు అన్యాయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకపోవాలని సమావేశంలో నిర్ణయించారు.

### బీసీలకు దక్కని పదవులు

బీజేపీలో బీసీలకు కీలక పదవులు దక్కడం లేదనే అభిప్రాయం ఉన్నది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రావు పద్మ రెండు సార్లు బీజేపీ జిల్లా అధ్యక్ష పదవిలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం వరకు బీసీ వర్గానికి చెందిన రావుల కిషన్‌కు జిల్లా అధ్యక్ష పదవి ఖరారైందని బీజేపీ వర్గాలు చెప్పాయి. అర్ధరాత్రి తర్వాత రెడ్డి వర్గం నేతల రాజకీయంతో బీసీకి అన్యాయం జరిగిందంటున్నారు. మూడు దశాబ్దాలుగా ఉన్న కిషన్‌కు మరోసారి అన్యాయం జరిగిందని, బీసీ వర్గాలకు అన్యాయం చేయడంతో పార్టీకి నష్టం జరుగుతుందని చెబుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మకు టిక్కెట్ ఇచ్చారని, అన్ని పదవులు ఒకే వర్గం వారికి ఇవ్వడం సరికాదంటున్నారు. ఉమ్మడి జిల్లా బీజేపీ చరిత్రలో రెండుసార్లు మినహా అన్ని సార్లు ఒకే వర్గం వారికి బీజేపీ అధ్యక్ష పదవి చేపట్టారని, ఇప్పుడు అదే తరహాలో బీసీలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి పరిస్థితిని వివరించి అల్టిమేటం ఇవ్వాలని బీసీ నేతలు నిర్ణయించారు. తగిన చర్యలు తీసుకోకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని సదరు నేతలు నిర్ణయించారు.

## నాలుగు జిల్లాల్లో మళ్లీ వారికే



సంతోష్‌రెడ్డి (హనుమకొండ)



రవికుమార్ (వరంగల్)



నిశిధర్‌రెడ్డి(భూపాలపల్లి)




రమేశ్ (జనగామ)

- హనుమకొండకు కొలను సంతోష్‌రెడ్డి
- వరంగల్‌కు గంటా రవికుమార్
- జనగామకు సొడ రమేశ్, ములుగుకు బలరాం, భూపాలపల్లికి నిశిధర్‌రెడ్డి

వరంగల్, ఫిబ్రవరి 3 : బీజేపీ జిల్లా అధ్యక్షులను సోమవారం ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ పరిధిలో మహబూబాబాద్ మినహా ఐదు జిల్లాల అధ్యక్షుల పేర్లు వెల్లడించారు. మానుకోట జిల్లాకు అధ్యక్షుడిని ప్రకటించలేదు. ఇక నాలుగు జిల్లాలకు పాత వారికే మరోసారి అవకాశం కల్పించగా హనుమకొండ జిల్లాకు మాత్రం కొత్త వారిని నియమించారు. అధ్యక్షులతో పాటు జిల్లాకు ఇద్దరు చొప్పున జిల్లా కౌన్సిల్ సభ్యులను ప్రకటించారు. హనుమకొండకు గతంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కొలను సంతోష్‌రెడ్డికి జిల్లా అధ్యక్ష పదవి దక్కింది. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పరకాల నియోజకవర్గానికి చెందిన గట్టు కొప్పుల రాంబాబు, పశ్చిమ నియోజకవర్గానికి చెందిన రావుల సుదర్శన్‌ను నియమించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గంటా రవికుమార్‌కు రెండోసారి నియమించారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా తూర్పు నియోజవర్గం నుంచి తాబేటి వెంకట్ గౌడ్, వర్ధన్నపేట నుంచి మరిపెల్లి రాంచంద్రారెడ్డిని నియమించారు. భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా నిశిధర్‌రెడ్డిని రెండోసారి నియమించారు. కౌన్సిల్ సభ్యుడిగా రాయరాకుల మొగిలిని నియమించారు. జనగామ జిల్లా అధ్యక్షుడిగా సొడ రమేశ్‌కు రెండోసారి అవకాశం అవకాశమిచ్చారు. కౌన్సిల్ సభ్యులుగా జనగామ నియోజకవర్గానికి చెందిన మహేందర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజవర్గానికి చెందిన పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, పాలకుర్తి నియోజవర్గానికి చెందిన కాసోజు సమ్మయ్య చారిలను నియమించారు. ములుగు జిల్లా అధ్యక్షుడిగా సిరికొండ బలరాంకు మరో అవకాశం కల్పించారు. కౌన్సిల్ సభ్యులుగా ములుగు నియోజవర్గానికి చెందిన భూక్యా జవహర్‌లాల్‌ను నియమించారు.

**కాకతీయ యూనివర్సిటీలో** ఓఎస్డీ(ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) పోస్టుపై రగడ మొదలైంది. ప్రత్యేకంగా పోస్టును సృష్టించి మరీ వివాదాస్పద ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డికి దాన్ని కట్టబెట్టడంపై యూనివర్సిటీలోని ఇతర ప్రొఫెసర్లు, ఉద్యోగులు, విద్యార్థుల్లో వ్యతిరేకత మొదలైంది. కేయూ వైస్ ఛాన్సలర్ కె.ప్రతాప్‌రెడ్డి పరిపాలన పరంగా సరిదిద్దుకోలేని తప్పు చేశారని అంటున్నారు. రిజిస్ట్రార్‌గా పనిచేసినప్పుడు జరిగిన అవినీతి, అక్రమాలు బయటికి రాకుండా ఉండేందుకే మల్లారెడ్డి పైరవీ చేసుకుని మరీ ఓఎస్డీ పోస్టు తెచ్చుకున్నారని చెబుతున్నారు. న్యాయ నిపుణులకు ఇవ్వాల్సిన ఈ పోస్టును ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి ఇవ్వడం సరైన నిర్ణయం కాదని మండిపడుతున్నారు.

- వరంగల్, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి)



మల్లారెడ్డి



# కేయూలో ఓఎస్డీ రగడ

## వివాదాస్పద అధికారికి ప్రత్యేక పోస్టు

- కీలక పోస్టులో మల్లారెడ్డి నియామకం
- వ్యతిరేకిస్తున్న ప్రొఫెసర్లు, ఉద్యోగులు, విద్యార్థులు
- ఓఎస్డీ పోస్టుపై బీసీ సంఘాల తీవ్ర ఆగ్రహం

### పైరవీతో పోస్టు

ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి తీరు వివాదాస్పదంగా ఉంటున్నదని యూనివర్సిటీలోని ప్రొఫెసర్లు, ఉద్యోగులు, విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. మొన్నటివరకు రిజిస్ట్రార్‌గా ఉన్న మల్లారెడ్డి పదవీకాలం పూర్తి కాగానే దొడ్డిదారిలో ఓఎస్డీ పోస్టులోకి వచ్చారని అంటున్నారు. వీసీ దీనిపై శనివారమే ఉత్తర్వులు ఇచ్చినా రహస్యంగా ఉంచారు. యూనివర్సిటీలోని అన్ని వర్గాల నుంచి విమర్శలు వస్తాయనే ఉద్దేశంతోనే ఇలా చేసినట్లు చర్చ జరుగుతున్నది. మల్లారెడ్డి ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా ఓఎస్డీ పోస్టులో చేరేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. వైస్ ఛాన్సలర్ స్థాయిలో ఛాంబర్‌ను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. గతంలో అనేక పదవుల్లో కొనసాగిన మల్లారెడ్డి సైన్స్ డీన్ పోస్టు తనకే కావాలనే ఉద్దేశంతో ఎస్టీ వర్గానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్‌కు అన్యాయం చేశారని ఆరోపణలు ఉన్నాయి. పీహెచ్‌డీ సీట్ల భర్తీలో అక్రమాలకు మల్లారెడ్డి ప్రధాన బాధ్యుడని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. యూనివర్సిటీల్లో ఓఎస్డీ పోస్టు సాధారణంగా ఉండదు. ప్రత్యేకమైన సందర్భాల్లోనే ఈ పోస్టును ఏర్పాటు చేస్తారు. అది కూడా న్యాయ నిపుణులనే ఈ పోస్టులో నియమిస్తారు. కోర్టు కేసులను విశ్లేషణాత్మకంగా అర్థం చేసుకుని యూనివర్సిటీ ప్రయోజనాలకు అనుగుణంగా న్యాయపరమైన చర్యలు తీసుకొనేలా వీరు పనిచేస్తారు. కోర్టులోని అంశాలపై వీసీకి, రిజిస్ట్రార్‌కు వివరించి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించుకునేలా ఓఎస్డీ విధులు నిర్వర్తిస్తారు. యూనివర్సిటీలో కొత్త, వింత సంప్రదాయం మొదలుపెట్టారని, ఎక్కడా లేని విధంగా మాజీ రిజిస్ట్రార్ మల్లారెడ్డిని ఓఎస్డీ పోస్టులో నియమించారని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి.

### వ్యతిరేకిస్తున్న విద్యార్థి సంఘాలు

ఓఎస్డీ పోస్టులో ప్రొఫెసర్ మల్లారెడ్డిని నియమించవద్దని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మల్లారెడ్డికి ఈ పోస్టు ఇవ్వొద్దని నిరసన తెలుపుతున్నారు. యూనివర్సిటీలో చరిత్రలో లేని పోస్టును ఏర్పాటు చేయడం ఎందుకని అంటున్నారు. మల్లారెడ్డి ఇంకా ఎన్ని పదవులు అనుభవిస్తారని ప్రశ్నిస్తున్నారు. మల్లారెడ్డి క్లాసులు చెబుతున్నారా? అనేది చూడాలని డిమాండ్ చేశారు.

రిజిస్ట్రార్‌గా ఉన్న మల్లారెడ్డిని తొలగించి ఓఎస్డీ పోస్టు క్రియేట్ చేసి పదవి ఇవ్వడం మోసమని, న్యాయ నిపుణులకు ఇవ్వాల్సిన పదవిని మళ్లీ రెడ్డికి కేటాయించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవలి వరకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహించి అనేక అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మల్లారెడ్డికి ఇప్పుడు కొత్తగా పోస్టు సృష్టించి మరీ ప్రత్యేక అధికారాలు కల్పించడం సరికాదని అంటున్నారు. యూనివర్సిటీపై పెత్తనమంతా ఒక వర్గం వారికి కట్టబెట్టేందుకే ఓఎస్డీ పోస్టును సృష్టించారని బీసీ సంఘాలు ఆగ్రహంతో ఉన్నాయి. వెంటనే ఓఎస్డీ పోస్టును రద్దు చేయాలని, లేకపోతే మల్లారెడ్డిని కాకుండా బీసీ వర్గం ప్రొఫెసర్‌ను ఈ పోస్టులో నియమించాలని డిమాండ్ చేస్తున్నాయి. మల్లారెడ్డికి అధికారాలు ఉంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అణగదొక్కడమే పనిగా పెట్టుకుంటారని బీసీ సంఘాలు వాపోతున్నాయి. 55శాతం జనాభా ఉన్న బీసీ వర్గాలకు అన్యాయం చేస్తూ మల్లారెడ్డికి ఈ పోస్టు కట్టబెట్టారని అంటున్నాయి. అధికార దాహానికి పైరవీలు తోడైందనడానికి నిదర్శనమే యూనివర్సిటీలో ఓఎస్డీ పోస్టు అని యూనివర్సిటీలో చర్చ జరుగుతున్నది. కేయూ చరిత్రలో ఇప్పటివరకు లేని పోస్టును తీసుకొచ్చి వైస్ ఛాన్సలర్ స్థాయిలో బాధ్యత లేని అధికారాలు అప్పగించారని ప్రొఫెసర్లు అభిప్రాయపడుతున్నారు. రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నప్పుడు వచ్చిన అవినీతి, అక్రమాల ఆరోపణలపై ఎలాంటి విచారణ జరపకుండానే పదవీకాలం ముగిసిన తర్వాత మరింత అధికారాలు ఉన్న పోస్టులో మల్లారెడ్డిని నియమించడం సరికాదని అంటున్నారు. ఓఎస్డీ పోస్టులో మల్లారెడ్డి ఉంటే మళ్లీ యూనివర్సిటీలో ఆయనే అధికారం చెలాయిస్తారని అప్పటి అవినీతి, అక్రమాలు బయటికి వచ్చే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.

## బీఆర్ఎస్ నాయకుడిపై దాడికి యత్నం

- వాట్సాప్ గ్రూపుల్లో ప్రశ్నించినందుకే..
- కాంగ్రెస్ బెదిరింపులకు భయపడం
- హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటాం: పోలీసు ధర్మారావు, బోడకుంట్ల ప్రకాశ్

గీసుగొండ, ఫిబ్రవరి 3 : వాట్సాప్ గ్రూపులో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రశ్నించిన బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శిరిశే శ్రీకాంత్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడానికి యత్నించారని మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, మండల నాయకుడు బోడ కుంట్ల ప్రకాశ్ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డిపై విమర్శలు చేస్తూ గీసుగొండ మండల వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారని చెప్పారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆదేశాలతో శ్రీకాంత్, దళిత బంధు మండల మాజీ నాయకుడు కోట ప్రమోద్ సదరు కాంగ్రెస్ నాయకుడు చేస్తున్న ఆరాచకాలను ఆయా గ్రూపుల్లో పోస్టు చేశారని తెలిపారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న అతడు కొంత మంది పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉసిగొల్పి ఆదివారం రాత్రి పది మందితో కోనాయిమాకుల వద్ద ఉన్న యూత్ అధ్యక్షుడిపై దాడి చేయాలని అక్కడికి వచ్చి గొడవకు దిగినట్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు కొంత మంది అక్కడికి చేరుకోవడంతో వారు కాంగ్రెస్ పార్టీపై, మా నాయకులపై విమర్శలు చేస్తూ గ్రూపుల్లో పోస్టులు పెడితే చంపుతామని బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తమపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంపై పోలీసులు శ్రీకాంత్‌ను పోలీస్‌స్టేషన్‌కు రావాలని, బైండోవర్ చేస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. దాడికి ఉసిగొల్పిందెవరని లోతుగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గొడవ విషయంపై మా నాయకుడు ధర్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, పోలీసులు మాపై కక్షపూరితంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారుల ఫిర్యాదు చేస్తామన్నారు.

### ఇరువర్గాల బైండోవర్

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వాట్సాప్ గ్రూపుల్లో ఒకరిపై మరొకరు విమర్శలు చేస్తూ పోస్టులు పెడుతూ గొడవకు దిగిన నేపథ్యంలో సోమవారం ఇరువర్గాల నాయకులు కోట రమేశ్, కోట సాల్మాన్, చిన్నగారి కుమార్, శిరిశే శ్రీకాంత్‌లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. ఎవరైనా దూషిస్తూ, విమర్శిస్తూ ,రెచ్చగొడుతూ గ్రూపుల్లో పోస్టులు పెట్టకూడదని, పెడితే అడ్మిన్‌దే బాధ్యతన్నారు.



మల్లూరులోని చింతామణి జలపాతం

ప్రకృతి ప్రసాదం..

# చింతామణి ధార

- మల్లూరు నీరు శ్రేష్టమని గుర్తింపు
- 32 రకాల పరీక్షలు నిర్వహించిన పరిశోధకులు
- ఎలాంటి రసాయనాలు, వ్యాధి కారకాలు లేవు
- శుద్ధి చేసిన నీటి కంటే స్వచ్ఛమని వెల్లడి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 3: ములుగు జిల్లాలోని మంగపేట మండలం మల్లూరులోని కొండలు, గుట్టలపై నుంచి నిత్యం వస్తున్న జలధార ఎంతో స్వచ్ఛమైనదని తాజాగా నిర్వహించిన పరిశోధనలో వెల్లడైంది. చింతామణి పేరుతో మల్లూరులోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి గుట్టపై నుంచి ఏడాది పొడవునా వచ్చే నీరు తాగేందుకు ఎంతో శ్రేష్టమైనదిగా తేటతెల్లమైంది. ఎలాంటి రసాయనాల మిళితం కాకుండా గుట్టలపై నుంచి వస్తున్నట్లు తేలింది. వాటర్ ల్యాబొరేటరీ చీఫ్ కెమిస్ట్రీ కృష్ణమూర్తి సమక్షంలో మూడు రోజుల పాటు ఈ నీటిపై 32 రకాల పరీక్షలు చేపట్టారు. నీటిలో ఫ్లోరైడ్, క్లోరైడ్ లేనట్లుగా ధ్రువీకరించారు. ఈ గుట్టపై అనేక రకాల వన మూలికల వృక్షాలు ఉండడంతో వీటి వేర్లను తాకుతూ వచ్చే నీరు ఎంతో శుద్ధిగా ఉన్నట్లు తేలింది. ఫిల్టర్లు, ఆర్‌వో ప్లాంట్ల నుంచి శుద్ధిచేసి వచ్చే నీటి కంటే భిన్నంగా ఉన్నట్లు గుర్తించారు. ఇలాంటి నీటిని ఎక్కడ చూడనట్లుగా పరిశోధకులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై రిటైర్డ్ న్యూరో వైద్యులు రాజారెడ్డి మాట్లాడుతూ ఎంతో స్వచ్ఛంగా వచ్చే నీటిని తాగడానికి, వంటలు చేసుకోడానికి ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాను ఇటీవల మల్లూరు వచ్చినపుడు నీటిని సేకరించి పరీక్షలకు పంపించినట్లు చెప్పారు. పరీక్షలో నమ్మలేని నిజాలు గుర్తించామన్నారు. ఇలాంటి స్వచ్ఛమైన నీరు ఎక్కడ లేదన్నారు. నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని సూచించారు. అనవసరంగా పంట పొలాలకు వాడడం కంటే ఈ నీటిని నిల్వచేసి గ్రామాలకు సరఫరా చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. భూగర్భం నుంచి కాకుండా ప్రకృతి నుంచి వచ్చే నీరుగా ఆయన అభివర్ణించారు. మానవుడికి హాని కలిగించే రసాయనాలు, వ్యాధికారకాలు ఈ నీటిలో లేవని పరిశోధనలో వెల్లడైనట్లు స్పష్టం చేశారు.

## పట్టాలివ్వాలని వాటర్ ట్యాంక్ ఎక్కిన రైతులు

### మంత్రి పొంగులేటి హామీ ఇచ్చినా అతీగతీ లేదని ఆగ్రహం



వాటర్ ట్యాంక్ ఎక్కిన నారాయణపురం గ్రామ రైతులు

కేసముద్రం, ఫిబ్రవరి 3 : కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతులు ఏడేళ్లుగా పట్టాలు ఇవ్వడం లేదంటూ సోమవారం పెట్రోల్ బాటిల్, పురుగుల మందు డబ్బా పట్టుకొని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న వాటర్‌ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. రెండున్నర గంటల పాటు ధర్నా చేయగా చివరికి తహసీల్దార్ దామోదర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. 60 ఏండ్లుగా సాగు చేస్తున్న వ్యవసాయ భూములకు కొత్త రెవెన్యూ గ్రామంగా ఏర్పడిన నాటి నుంచి ఈ సమస్య ఏర్పడుతుందని అన్నారు. పలు మార్లు అధికారులు ఎంజాయిమెంట్ సర్వే నిర్వహించినప్పటికి కొంత మందికే పట్టాలు ఇస్తూ చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. పట్టాల ఇవ్వకపోవడంతో ప్రభుత్వ పథకాలను పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశా రు. అసెంబ్లీ సమావేశాల్లో నారాయణపురం గ్రామ రైతుల గురించి మాట్లాడి పట్టాలు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా అతీగతీ లేదన్నారు. ఇంకా 1124 ఎకరాల భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా నిర్వహించిన వారిలో ధరావత్ రవి, లక్ష్మీపతి, ఎడవెల్లి వెంకట్‌రెడ్డి, మిర్యాల యాకూబ్ రెడ్డి, భగునా, కీమా తదితరులున్నారు.



సీట్ల కోసం కొట్టుకుంటున్న మహిళలు

## ఫ్రీ బస్‌లో సీట్ల కోసం కొట్లాట

### సోషల్ మీడియాలో వీడియో వైరల్

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 3 : ఆర్టీసీ ఫ్రీ బస్సులో సీట్ల కోసం మహిళలు కొట్టుకుంటున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో ఈ ఘటన చోటుచేసుకోగా దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఫ్రీ బస్సు వచ్చిన తర్వాత కాళేశ్వరం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. అయితే రద్దీకనుగుణంగా బస్సులు లేక, సమయానికి దొరకక మహిళలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. దీంతో వచ్చిన బస్సులో సీట్ల కోసం ఘర్షణ పడుతున్న వీడియోలు ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.



వ్యవసాయ మార్కెట్‌కు భారీగా తరలివచ్చిన మక్కలు

## మార్కెట్‌కు పోటెత్తిన మక్కలు

- 10 రోజుల ముందుగానే వచ్చిన పంట
- రాశులతో మార్కెట్ యార్డు కళకళ
- ప్రభుత్వ మద్దతుకు మించి ప్రైవేట్ ధర
- వారివైపే మొగ్గు చూపుతున్న రైతులు

నర్సంపేట, ఫిబ్రవరి 3 : వరంగల్ జిల్లా నర్సంపేటలోని వ్యవసాయ మార్కెట్‌కు మక్కలు పోటెత్తాయి. గతంతో పోల్చితే 10-15 రోజుల ముందుగానే మక్కలు మార్కెట్‌కు వచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ. 2,200 ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.2,350 నుంచి రూ. 2,450 వరకు ధర పెట్టి ఇదే మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రూ. 250 వరకు అదనంగా వస్తుండడంతో రైతులు వారివైపే మొగ్గు చూపుతున్నారు. నాలుగైదు రోజులుగా అన్ని మార్కెట్‌లు మక్కలతో కళకళలాడుతున్నాయి.

### తేమ తక్కువగా ఉంటేనే..

తేమ శాతం తక్కువగా ఉన్న మక్కలనే ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా మాయిశ్చర్ 14-15 శాతం ఉండేలా చూసుకోవాలని వ్యాపారులు రైతులకు సూచిస్తున్నారు. పూర్తిగా ఆరిన తర్వాతనే మక్కలను మార్కెట్‌కు తీసుకురావాలంటున్నారు. దీంతో పలువురు రైతులు మార్కెట్ యార్డుల్లో రోజుల తరబడి మక్కలను ఆరబోసి విక్రయిస్తున్నారు.

### 10 రోజుల ముందే..

ఈ దఫా మక్కలు మార్కెట్ యార్డుకు 10 రోజుల ముందుగానే వచ్చాయి. గతంలో ఫిబ్రవరి రెండో వారంలో వచ్చేవి. రైతులు వానకాలంలో పత్తి సాగు చేయగా ఒకసారి మాత్రమే పంట ఏరి దానిని తొలగించారు. దానిస్థానంలో నవంబర్ చివరలో మక్కజొన్న పంట వేశారు. ఈ పంట 15 రోజుల ముందుగానే కోతకు రావడంతో రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా, నర్సంపేట నియోజకవర్గంలో మొత్తం 56,150 ఎకరాల్లో మక్కజొన్న సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. నెక్కొండ మండలంలో 13,450 ఎకరాలు, చెన్నారావుపేటలో 11,380, దుగ్గొండిలో 10,890, నల్లబెల్లిలో 9,880, నర్సంపేటలో 7,500, ఖానాపూర్ మండలంలో 3,050 ఎకరాల్లో మక్కజొన్న పంట వేసినట్లు వారు పేర్కొన్నారు.

ఎండిన మక్కలను దగ్గరకు నెడుతున్న రైతులు



## బీసీ కుల గణన అశాస్త్రీయం

- తక్కువ చేసి చూపడం ఆమోదయోగ్యం కాదు
- బీసీలకు అన్యాయం చేయాలని చూస్తున్న సర్కారు
- రాష్ట్ర జనాభానూ తగ్గించి చూపుతున్న ప్రభుత్వం
- బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు



కుల గణనపై లేఖ విడుదల చేస్తున్న బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు

వరంగల్, ఫిబ్రవరి 3 : తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో బీసీ జనాభాను తక్కువ చేసి చూపించడం అశాస్త్రీయమని, ఆమోదయోగ్యం కాదని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు మండిపడ్డారు. సోమవారం బాలసముద్రంలో బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దారబోయిన సతీశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ జనాభాను తక్కువ చూపించడంపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తామన్నారు. బీసీ జనాభా 46.25 శాతంగా చూపడం అంటే వాస్తవ లెక్కలను మరుగుపర్చడమేనన్నారు. 2015లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 51 శాతం ఉన్నదని, పదేళ్ల తర్వాత అది మరింత పెరగాల్సి ఉండగా, తగ్గడం ఏంటని ప్రశ్నించారు. బీసీ, మైనార్టీలతో కలుపుకొని 62 శాతంగా ఉన్న బీసీ జనాభాను రాష్ట్ర ప్రభుత్వం 56 శాతంగా చూపుతూ అన్యాయం చేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. అలాగే తెలంగాణలో జనాభా 4.10 కోట్లుంటే సర్వే రిపోర్టులో 3.54 కోట్లుగా కాంగ్రెస్ సర్కారు తగ్గించి చూపిందన్నారు. సమగ్రంగా లేని కుల గణనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, వెంటనే పునః సమీక్ష చేయాలని శేషు డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు నూతనకంటి ఆనందం, ఎదునూరి రాజమౌళి, పాలడుగుల సురేందర్, చిన్నాల యశ్వంత్, ఎర్రబోజు రమేశ్, దాడబోయిన శ్రీనివాస్, వినయ్‌చారి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.